ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.4
**
సూర్యాపేట
5
సోమవారం 21 అక్టోబరు 2024



నీ సేవకు సలాం

నిన్నెలా మరవగలం

- విధి నిర్వహణలో ప్రాణాలకు ఎదురొడ్డి నిలిచిన పోలీసులు
- ప్రజల రక్షణే ధ్యేయం.. ప్రాణాలు లెక్కచేయని నైజం
- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

మనమంతా రాత్రి ఇంట్లో ప్రశాంతంగా నిద్రపోతున్నామంటే వారు రాత్రంతా గస్తీ తిరుగుతుంటేనే సాధ్యమవుతోంది.. రోడ్డుపై మనం బండి మీద రయ్యిన ఎలాంటి ట్రాఫిక్‌జాం కాకుండా వెళ్తున్నామంటే వారి వల్లే.. మనం సంపాదించిన ఆస్తులు భద్రంగా ఉన్నాయని గుండెపై చేయివేసుకొని హాయిగా ఉన్నామంటే వారి భరోసా వల్లే.. ప్రజాప్రతినిధులు, సెలబ్రెటీలు ప్రజల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా తిరుగుతున్నారంటే వారు కల్పిస్తున్న భద్రత వల్లే.. ఆపదలో ఉన్నా.. ఆపత్కాలంలో ఉన్నా.. ముందుగా స్పందించి అండగా ఉన్నామంటూ ముందుకొచ్చేవారే పోలీసులు. మన మాన, ధన, ప్రాణాలు కాపాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న ఎందరో పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. వారిని కోల్పోయిన కుటుంబాలు శోకాన్ని దిగమింగుతూనే వారి మిగిల్చిన ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారు. దిక్కును కోల్పోయిన వారికి ప్రభుత్వం ఉద్యోగమిచ్చి ఉపాధి కల్పించగా, కుటుంబాన్ని పోషిస్తూ పిల్లలు ఉన్నతస్థితిలో చూడాలని కలలుగన్న పోలీస్ అమరుల లక్ష్యాలు నెరవేర్చేందుకు ముందుకు సాగుతున్నారు. నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా వారి కుటుంబసభ్యులను 'ఆంధ్రజ్యోతి'తో పలకరించగా, చెమ్మగిల్లిన కళ్లతో జ్ఞాపకాలను పంచుకున్నారు.

- వివరాలు 7లో..



మా లాంటి కడుపుకోత ఎవరికీ రాకూడదు

నా కుమారుడు పోలీస్ ఉద్యోగం చేస్తూ మమ్మల్ని దగ్గరుండి జాగ్రత్తగా చూసుకుంటాడని ఎంతో ఆశపడ్డాం. కానీ, ఎదిగిన కుమారుడు అకాల మరణం మమ్మల్ని దిక్కులేని పక్షిలా మార్చింది. పెద్ద కుమారుడు 1981లో అనారోగ్యంతో మృతిచెందాడు. ఉన్న చిన్న కుమారుడు కానిస్టేబుల్ నాగరాజు 2015లో జానకీపురం ఘటనలో ఉగ్రవాదుల కాల్పుల్లో అమరుడయ్యాడు. ఇద్దరు కుమారులను కోల్పోయి, నేను, నా భార్య లక్ష్మి పడుతున్న మానసిక ఆవేదన ఎవ్వరూ తీర్చలేనిది. మా లాంటి కడుపు కోత ఎవ్వరికీ రాకూడదు.

- శివన్నారాయణ, కానిస్టేబుల్ నాగరాజు తండ్రి



పోషకాహార లోపం పీడిస్తోంది

విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందినట్టు. అందుకోసం ప్రభుత్వాలు విద్యార్థుల ఆరోగ్య రక్షణపై దృష్టిసారించాయి. అందులో భాగంగా వారికి ప్రభుత్వం ఆరోగ్య పరీక్షలు చేయిస్తోంది. అయితే ఈ పరీక్షల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలో సుమారు 20వేల మంది విద్యార్థులు పోషకాహార లోపంతో ఏర్పడిన రక్తహీనతతో బాధపడుతున్నారు. అంతేగాక 10వేల మంది విద్యార్థులు పలు రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట(కలెక్టరేట్)

- రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులు
- జిల్లాలో 20వేల మంది గుర్తింపు
- 10వేల మంది విద్యార్థులకు పలు వ్యాధులు
- ఆర్‌బీఎస్‌కే ఆరోగ్య పరీక్షల్లో వెల్లడి

ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమానికి (ఆర్‌బీఎస్‌కే) రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీని అమలుకు సంచార వైద్య బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ఇద్దరు వైద్యులతో పాటు మరో ఇద్దరు ఆరోగ్య సిబ్బంది ఉంటారు.వీరంతా ప్రతీపనిదినంలో వారికి కేటాయించిన ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఒక్కోబృందం కనీసం 120మంది విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తుంది. ఈపరీక్షల్లో విద్యార్థులకు ఏవైనా వ్యాధులను గుర్తిస్తే వాటి తీవ్రతను బట్టి సంబంధిత పీహెచ్‌సీలు,ఏరియా ఆస్పత్రులు, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, రాష్ట్ర ఆస్పత్రులకు వైద్య చికిత్సల నిమిత్తం పంపుతారు. అయితే ఈ బృందాలు నిర్వహించిన పరీక్షల్లో ఎక్కువ మంది విద్యార్థులు రక్తహీనత (అనీమియా)తో ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించాయి.

20 వేల మందిలో రక్తహీనత

జిల్లాలో రక్తహీనతతో విద్యార్థులు బాధపడుతున్నారు. ప్రధానంగా 12-16 ఏళ్ల బాలికల్లో రక్తహీనత ఉంది. ప్రతీ ఆరుగురిలో ఒకరు రక్తహీనతతో బాధపడుతున్నట్లు సమాచారం. సాధారణంగా హిమోగ్లోబిన్ 7 నుంచి 8గ్రాములు ఉండాలి. అయితే విద్యార్థుల్లో 7గ్రాముల కంటే తక్కువ హిమోగ్లోబిన్ ఉంది. రక్తహీనతను అధిగమించేందుకు విద్యార్థులకు సరైన అవగాహన కల్పించడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 20వేల మంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నారు. రక్తహీనత కారణంగా విద్యార్థుల్లో ఎదుగుదల లోపిస్తోంది. అంతేగాక వారు విద్యాభ్యాసంలో వెనకబడిపోతున్నారు. తరుచూ నీరసంగా ఉంటూ, వారి పనులు వారు చేసుకోలేకపోతున్నారు. అంతేగాక ఇన్‌ఫెక్షన్‌కు గురవుతున్నారు. నెలసరి ఉండే బాలికల్లో రక్తహీనత సమస్య అధికంగా ఉంటోంది.

జిల్లాలో తొమ్మిది సంచార వైద్యబృందాలు

జిల్లా పరిధిలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు తొమ్మిది సంచార వైద్య బృందాలు ఉన్నాయి. ఒక్కో వైద్య బృందంలో ఒక ఆయుర్వేద, ఒక అల్లోపతి

మిగతా 8వ పేజీలో...

10వేల మందికి వివిధ వ్యాధులు

జిల్లా పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో వివిధ వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులు 10వేల మందికి పైగా ఉన్నారు. ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం కింద జిల్లాలోని 1,196 అంగన్‌వాడీ కేంద్రాలు, 30 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 1,055 పాఠశాలల్లో 2,17,677 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అందులో పౌష్టికాహార లోపంతో 3,771 మంది, సాధారణ వ్యాధులైన దగ్గు, జలుబుతో 2,346 మంది, చర్మవ్యాధులతో 807మంది, దంత సమస్యలతో 611 మంది, దృష్టి లోపంతో 995 మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా నెలసరి సమస్యలతో 298 మంది, గుండె సమస్యలతో 79మంది, నరాల వ్యాధులతో 77మంది, వినికిడి లోపంతో 70మంది, మూత్ర సంబంధిత వ్యాధులతో 91 మంది, పుట్టుకతో వినికిడి లోపంతో 34 మంది, సరైన ఎదుగుదల లేక 931 మంది, వంకర పాదాలతో 45 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీరితో పాటు మరో 102 మంది విద్యార్థులు మానసిక దివ్యాంగులుగా ఉన్నారు.

బీఆర్ఎస్ నిరసన



వానాకాలం రైతుభరోసాను నేటికీ ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. వెంటనే రైతుభరోసాను ప్రకటించాలని డిమాండ్ చేశాయి. జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను పార్టీ నాయకులు దహనంచేశారు.

•8లో..

ఏపీలో బ్రాండెడ్ మద్యం

మనకు తగ్గిన ఆదాయం



- రాష్ట్ర సరిహద్దులో మొత్తం 12దుకాణాలు
- నిత్యం రూ.24లక్షల మేర తగ్గిన విక్రయాలు
- ఏపీలో క్వార్టర్‌కు అదనంగా రూ.20 ధర
- త్వరలో పెరగనున్న మద్యం ధరలు?

ఏపీలో కొలువు తీరిన కూటమి ప్రభుత్వం, పాత మద్యం విధానానికి స్వస్తి చెప్పి, 2019కు ముందు ఉన్న టెండర్ల పాలసీని తీసుకొచ్చింది. అంతేగాక గత ప్రభుత్వ హయాంలో ఉన్న మద్యం బ్రాండ్ల స్థానంలో కొత్త బ్రాండ్లను తీసుకువచ్చి, వారం రోజుల నుంచి విక్రయాలు ప్రారంభించింది. ఆ ప్రభావం మన రాష్ట్ర సరిహద్దులో ఉన్న మద్యం దుకాణాల్లో విక్రయాలపై పడింది. ఫలితంగా ఇక్కడా ఆదాయం తగ్గింది.

- (ఆంధ్రజ్యోతి,కోదాడ)

ఏపీలో గత ప్రభుత్వ హయాంలో పేరున్న మద్యం బ్రాం డ్లు దొరికేవు కావు. దీంతో ఏపీ సరిహద్దులో ఉన్న గ్రామాలకు చెందిన మద్యం ప్రియులు తెలంగాణ సరిహద్దులోని గ్రామాలకు వచ్చి బ్రాండెడ్ మద్యం తాగి వెళ్లేవారు. దీంతో ఇక్కడి వైన్స్ దుకాణదారులు బ్రాండెడ్ మద్యం (రాయల్ చాలెంజ్ విస్కీ, కింగ్ ఫిషర్ బీర్ల లాంటివి) విక్రయించి ఆదాయం గడించేవారు. సరిహద్దులో ఉన్న ఒక్కో మద్యం దుకాణంలో ఏపీ ప్రజల కారణంగా నిత్యం రూ.1.50లక్ష నుంచి రూ.2లక్షల వరకు విక్రయాలు జరిగేవి. దుకాణాలకు ఇచ్చిన లక్ష్యం లోపు వైన్స్ దుకాణాలు విక్రయాలు చేస్తే ప్రభుత్వానికి ఆయా విక్రయాల్లో 50శాతం, లక్ష్యానికి మించి విక్రయాలు చేస్తే 70శాతం ఆదాయం వచ్చింది. ఏపీలో ప్రభుత్వం మారడం, నూతన మద్యం పాలసీకి మొగ్గు చూపడం, ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వ దుకాణాలకు బదులు టెండర్లు పిలిచి ప్రైవేట్ వ్యక్తులకు మద్యం దుకాణాలు అప్పగించింది. అంతేగాక బ్రాండెడ్ మద్యంను అందుబాటులోకి తెచ్చింది. దీంతో తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని భద్రాచలం, సత్తుపల్లి, ఆశ్వారావుపేట, మధిర, కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, సాగర్ నియోజకవర్గాలతోపాటు, కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో ఉన్న మన రాష్ట్ర మద్యం దుకాణాల్లో విక్రయాలు పడిపోయాయి. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో రాష్ట్ర సరిహద్దులో 12 వైన్స్ దుకాణాలు ఉన్నాయి. ఒక్కో దుకాణంలో రోజుకు రూ1.50లక్ష నుంచి రూ.2లక్షల

మిగతా 8వ పేజీలో...

మద్యం ధరలు ఇలా

	తెలంగాణలో ధరలు			ఏపీలో (రూ.)		
మద్యంపేరు	క్వార్టర్	హాఫ్	ఫుల్	క్వార్టర్	హాఫ్	ఫుల్
రాయల్‌చాలెంజ్	210	420	840	230	460	920
ఆఫీసర్స్ ఛాయిస్	150	300	600	150	300	600
మ్యాన్షన్ హౌస్	170	350	690	220	440	880
ఓల్డ్‌మంక్	180	360	720	230	440	880
ఐబీ	180	360	720	180	360	720
ఓసీ	150	300	600	150	300	600
మెక్‌డోల్	180	360	720	180	360	720
ఓఏబీ	130	-	520	120	-	440
బీర్	లైట్	స్ట్రాంగ్		లైట్	స్ట్రాంగ్	
కింగ్ ఫిషర్	150	160		190	200	
ఆర్‌సీ	150	160		190	200	

మట్టపల్లిలో శాస్త్రోక్తంగా నృసింహుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మఠంపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో యాదగిరిగుట్టగా పేరొందిన మట్టపల్లి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో ఆదివారం స్వామివారి నిత్య కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన, మంగల్యధారణ, తలంబ్రాల తంతుతో నిత్య కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారికి మహానివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రీ, శేషగిరిరావు, రాజష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమాజ మార్పు బాధ్యతను తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసిం



పీడీఎస్‌యూ పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసిం

కోదాడటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సంక్షోభంలో ఉన్న సమాజంలో మార్పు తీసుకొచ్చే బాధ్యత బుద్ధిజీవులపై ఉందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసిం అన్నారు. పీడీఎస్‌యూ అర్ధదశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల పీడీఎస్‌యూ పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సమాజ జ్ఞానం పెరగాలంటే విద్యార్థులు ప్రపంచ చరిత్రను అధ్యయనం చేయాలన్నారు. భూస్వామ్య పెట్టుబడిదారి విధానాలపై పోరాడిన మావో వందేళ్ల ప్రపంచ చరిత్రను సూక్ష్మంగా అధ్యయనం చేశారని గుర్తుచేశారు. ఆయన నడవలేకపోయినా, సంక్షోభంలో ఉన్న సమాజానికి సంభాషణగా మారిన ప్రొఫెసర్ సాయిబాబా పోరాట స్ఫూర్తిని యువత పుణికిపుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నాణ్యమైన విద్య ఉద్యోగం అమలు చేయకుండా సమాజాన్ని సంక్షోభంలో పడేసినప్పుడు సాయిబాబా 'నేను చావును నిరాకరిస్తున్నా' అని రాసిన కవిత ప్రధాని మోదీని భయభ్రాంతులకు గురిచేసిందన్నారు. సాయిబాబా పోరాటం చిరస్మరణీయమన్నారు. కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రగతిశీల ప్రజాస్వామ్య భావజాలనికి పురుడుపోస్తే వెలిదండ విప్లవ పాఠశాలగా పేరుగాంచింది అన్నారు. నాటి పూర్వవిద్యార్థులు రాయపూడి చిన్ని, గౌరీశంకర్‌తో పాటు వారిని ప్రోత్సహించిన కరెంటు రామిరెడ్డి నిబద్ధత అభినందనీయమన్నారు. కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థి, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ, నాటి పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం గోడల మీద రాతలే జ్ఞాన నాదులుగా పనిచేశాయన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 24న జరిగే పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో రాయపూడి చిన్ని వెంకటేశ్వరరావు, వక్కవంతుల నాగార్జున, వల్లూరి రామిరెడ్డి, కె.బాబురావు, కాకి భాస్కర్, ధర్మార్జున్, పందిరి నాగిరెడ్డి, గంధం బంగారు, ముత్తవరపు పాండురంగారావు, పారా సీతయ్య, రాజేష్, పెదనాటి వెంకటేశ్వరరావు, ముప్పాని కృష్ణారెడ్డి, రామనర్సయ్య, హరికిషన్, రాఘవరెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సింహాద్రి, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



సేవచేస్తూ.. ప్రేమను పంచుతూ

ఉద్యోగం కోసం ప్రయత్నాలు..

సామాజిక సేవలో ముందుకు వెళ్తున్న శ్రీకాంత్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి కావడంతో ఉద్యోగం సాధించేందుకు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. రెండేళ్ల క్రితం రైల్వే శాఖలో, గ్రూప్-4లో ప్రయత్నం చేయగా కొద్దిలో చేజారింది. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించి తీరుతానని పట్టుదలతో చెప్పన్నాడు.

అధికారులు, పోలీసుల సాయంతో అనాథను ఆశ్రమానికి తరలిస్తున్న శ్రీకాంత్ (ఫైల్)

అతడు అపర కుబేరుడు కాదు. లక్షల జీతాలు వచ్చే ఉద్యోగంలో లేడు. పెద్ద పెద్ద కంపెనీల తోడ్పాటు అంతకన్నా లేదు. అయి తేనేం స్పందించే గుణం ఉంటే చాలు అని నిరూపిస్తున్నాడు నల్లగొండ పట్టణానికి చెందిన భీమనపల్లి శ్రీకాంత్. సొంత లాభం కొంత మానుకొని సేవలు సాయపడవచ్చో చేసి చూపిస్తున్నాడు.

- రామగిరి, ఆంధ్రజ్యోతి

12ఏళ్లుగా సామాజిక సేవలనందిస్తున్న నల్లగొండ యువకుడు

అనాథ శవాలు, కరోనా మృతులకు సైతం అంత్య క్రియలు

నల్లగొండ పట్టణ శివారులోని పానగల్‌కు చెందిన భీమనపల్లి సత్తెమ్మ, రమేశ్ దంపతుల కుమారుడు శ్రీకాంత్. 31 సంవత్సరాల వయస్సు గల శ్రీకాంత్‌కు తన చిన్నతనంలో ఓ వ్యక్తి తన కండ్ల ముందే తండ్రిని కొట్టి బయటికి వెళ్లగొట్టడం చూసి చలించిపోయాడు. వృద్ధుడు ఎక్కడికి వెళ్తాడు, ఎలా బతుకుతాడు, అలానా పాలన ఎవరు చూస్తారన్న ఆలోచన అప్పుడే అతడికి తట్టింది. దాంతో ఎలాగైనా ఇలాంటి వృద్ధులకు సహాయం చేయాలనే ఆలోచనతో సామాజిక సేవకు పునుకున్నాడు. నాటి నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోనే ఉన్నాడు. కరోనా రక్కసి బారిన పడి మృతి చెందినప్పుడు కుటుంబ సభ్యులు సైతం రాని సమయంలో అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించాడు.



సామాజిక కార్యక్రమాలు ఇవి...

ఎంఎస్‌డబ్ల్యూ(మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్) పూర్తి చేసినప్పటికే 2012లో చారుమతి చైల్డ్‌కేర్‌లో ఉన్న అనాథ పిల్లల అలనా పాలన చూసుకోవడంతో సామాజిక సేవా కార్యక్రమంలోకి అడు గు పెట్టాడు. అనంతరం హైదరాబాద్ కేంద్రంగా వెలిసిన సేవాభారతి సంస్థలో సభ్యుడిగా చేరి నాటి నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోన్నాడు. తన కులవృత్తి రజక కావడంతో ఇస్త్రీ చేస్తూ, కుటుంబాన్ని పోషించుకుంటూ సేవాభారతి ట్రస్ట్ ద్వారా నల్లగొండ పట్టణంలో చదువుపై ఇష్టం ఉండి పుస్తకాలు కొనుగోలు చేయ లేని నిరుపేదలకు వీధి గ్రంథాలయాల పేరిట పుస్తకాలు కొనివ్వడం, ప్రాణాపాయంలో ఉన్నామని రక్తం కావాలనే వారికి తన బృందంతో వెంటనే దవాఖానకు వెళ్లి రక్తాన్ని అందిస్తాడు. రోడ్లపై అభాగ్యులుగా ఉన్నవారికి గుర్తించి చేరదీసి చికిత్స చేయించి అనాథ ఆశ్రమంలో చేయించడంతో పాటు వారి బాగోగులు కూడా ఎప్పటికప్పుడు తెలుసుకుంటాడు.

అభాగ్యులకు అండగా..

గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం నంబూరుకు చెందిన కొండేటి మరియమ్మ దారి తప్పి నల్లగొండ రైల్వే స్టేషన్‌లో దిగి రామగిరిలో దిక్కుతోచని దుస్థితిలో కనిపించింది. గమనించిన శ్రీకాంత్ ఆమె వద్దకు వెళ్లి వివరాలు సేకరించేందుకు ప్రయత్నించాడు. అయితే ఆమె ఊరు పేరు తప్ప మరేమీ చెప్పలేని స్థితిలో ఉండగా, ఊరు పేరును గూగుల్‌లో వెతికి ఆయా కలెక్టర్ కార్యాలయానికి తెలిపి ఆమెను సొంత ఊరుకు పంపించాడు.ఇలాంటికార్యక్రమాలు చేస్తూ అధికారులతో శభాష్ అనిపించుకుంటున్నాడు.

గవర్నర్‌తో ప్రశంసాపత్రం

12ఏళ్లుగా సేవలో ముందుకు వెళ్తున్న శ్రీకాంత్ సేవలను గుర్తించిన నాటి గవర్నర్ తమిళిసై గుర్తించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అంతేకాకుండా భారతీయ ట్రస్ట్ అనేసంస్థ అంబేద్కర్ జాతీయ అవార్డును అందజేసింది.



మతిస్థిమితం లేని వ్యక్తి స్నానం చేయిస్తున్న శ్రీకాంత్ (ఫైల్)

ప్రతి ఒక్కరూ స్వతహాగా జీవించేలా కృషి



నేను చేస్తున్న సేవలకు పోలీస్ శాఖ, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఎంతో సహకారం అందిస్తోంది. దాతలు కూడా ముందుకు వస్తుండడంతో సేవ చేయడానికి ఎంతో సంతోషిస్తున్నా. డిగ్రీ పూర్తి చేసిన వారికి దాతల సహకారంతో కంప్యూటర్‌లో సీ, సీ-ప్లస్, జావా, పైథాన్ వంటి కోర్సులపై శిక్షణ ఇప్పించి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం ఇప్పించడమే నా లక్ష్యం.

- భీమనపల్లి శ్రీకాంత్

నిత్యం 50 మందికి భోజనం

'అన్నసంతర్పణం' పేరిట రోడ్ల వెంట ఉండే వారికి ప్రతిరోజు 50మందికి భోజనం అందిం చడంతో పాటు పట్టణంలో ఎవరైనా శుభకార్యాలు చేస్తే మిగిలిపోయిన ఆహా రాన్ని సేకరించి సేవా బస్తీ అనే కాలనీ వాసులకు అందిస్తుంటాడు. నిరుపేద మహిళలు ఆర్థికంగా ఎదుగాలన్న లక్ష్యంతో మహిళా స్వాభిమాన్ పేరిట కార్యక్రమం చేపట్టి దాతల సహకారంతో కుట్టుమిషన్లు, గ్రైండర్లు ఇప్పించి స్వయం కృషితో బతికేలా దారి చూపిస్తున్నాడు. ఇక నారాయణ సేవ పేరిట ప్రతి ఇంట్లో నెలలో ఒక రోజు కిలో బియ్యం సేకరించి అనాథాశ్రయాలకు ఇస్తుంటాడు. దాంతో పాటు యువత పెడదారిన పడకుండా మాదకద్రవ్యాల నిర్మూలన కోసం వివిధ సామాజిక కార్యక్రమాలు చేపడుతుంటాడు.



భోజనం అందిస్తూ..

చల్లారని 'ఇందిరమ్మ' కమిటీల చిచ్చు

● ఎమ్మెల్యే సామేల్ వద్దకు చేరిన పంచాయితీ

మోత్కూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు చిచ్చు మోత్కూరు మునిసి పాలిటీ కాంగ్రెస్‌లో ఇంకా చల్లారలేదు. కాంగ్రెస్ నా యకుల్లో ఏర్పడిన విభేదాలతో గడువు ముగిసినా కమిటీలు ఏర్పాటు కాక పోవడాన్ని 'కాంగ్రెస్‌లో ఇందిరమ్మ కమిటీల చిచ్చు' శీర్షికన ఈ నెల 17న ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. పదేళ్ల తర్వాత అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ మోత్కూరు నాయకులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ నాయకుల్లో కొందరు మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, మరికొందరు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మె ల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్ వర్గాలుగా వ్యవహరిస్తున్నారన్నది ఇక్కడ బహిరంగ రహస్యమే. కాంగ్రెస్‌లో చాలా కాలంగా ఉంటున్న సీనియర్ నాయకు లు, ఎన్నికల ముందు, ఆతర్వాత కొత్తగా పార్టీలోకి వచ్చిన నాయకుల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేప థ్యంలో ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తుండడంతో కాంగ్రెస్ వర్గాల్లో నెలకొన్న విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ నెల 16 నాటికి గ్రామాల్లో, మునిసిపాలిటీల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు పూర్తి కావాల్సి ఉండగా, గ్రామాల కమిటీల ఏర్పాటు ఇటీవల పూర్తయినా, మోత్కూరు మునిసిపాలి టీలో ఇంకా పూర్తి కాలేదంటున్నారు. కాంగ్రెస్ నాయకుడు, మునిసిపల్ చైర్‌ప ర్సన్ గుర్రం కవిత భర్త డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి మధ్య విభేదాలు ఉన్న ట్లు తెలుస్తోంది. కష్ట కాలంలో కాంగ్రెస్‌ను అంటిపెట్టుకుని ఉండి, కార్యకర్తలను కాపాడిన తనకు కనీస సమాచారం ఇవ్వకుండా మోత్కూరు మునిసిపాలిటీ వార్డు ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారని పైళ్ల సోమిరెడ్డి వాపోతున్నారు. ఆదివారం అడ్డగూడూరుకు వచ్చిన ఎమ్మెల్యే మందుల సామేల్‌ను సోమిరెడ్డి సుమారు వందకు పైగా కార్యకర్తలతో వెళ్లి కలిశారు. ఇందిరమ్మ క మిటీల ఏర్పాటులో మొదటి నుంచి పార్టీలో ఉన్న కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎమ్మెల్యేకు వివరించినట్లు తెలి సింది. తన వద్దకు వచ్చిన నాయకుల, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకుని తాను మాట్లాడి సర్దుబాటు చేస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిసింది.

యాదగిరికొండపై భక్తుల రద్దీ

భువనగిరిఅర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో యాదగిరి కొండపై సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవురోజు కావడంతో 25వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనానికి గంట, ధర్మదర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండ పాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద కూడా రద్దీగా మారాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.43,81,003 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. సుప్రభాతసేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్య పూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.




లక్ష్మీనృసింహుడికి నిత్య కల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు



యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో క్యూలైన్ల కాంప్లెక్స్‌లో భక్తుల రద్దీ

నిత్యాన్నదానానికి మేము సైతం



యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు కొండకింద 5వేల మంది ఒకేసారి భోజనం చేసేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే నిత్యాన్నదానం కొనసాగుతుండగా, ఆలయ సిబ్బంది 285మంది మేము సైతం అంటూ ఒక రోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. ఇందుకు సంబంధించిన రూ.5,30,000ల చెక్కును ఆలయ కార్యనిర్వహణాధికారి భాస్కరరావు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు అందజేశారు.

● భువనగిరి అర్బన్, ఆంధ్రజ్యోతి

ఉర్సు సంబురం



వారాంతపు సెలవు రోజు కావటంతో నల్లగొండ జిల్లా కేంద్రంలోని హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి ఉర్సు ఉత్సవాలతో క్లాక్‌టవర్ కూడలి రద్దీగా మారింది. ఉర్సులో భాగంగా ఏర్పాటుచేసిన దుకాణాల్లో షాపింగ్ చేస్తూ పెద్దలు... ఆటలాడుతూ చిన్నారులు సందడి చేశారు. రాష్ట్రంలోని నలుమూలల ప్రాంతాల నుంచేగాక వివిధ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి దర్గాను దర్శించుకుంటున్నారు.

● నల్లగొండ కల్చరల్, ఆంధ్రజ్యోతి

యాదగిరీశుడి మహా ప్రసాదం



భక్తులకు ఎప్పుడూ అభయ స్వరూపుడిగా గోచరించే యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడు భక్త వల్లభుడు.. తెలంగాణ తిరుపతిగా పేరొందిన యాదగిరిగుట్ట నృసింహుడిని దర్శించుకునేందుకు వచ్చేవారితో యాదగిరిక్షేత్రం తిరువీధులు ఆదివారం సందడిగా మారాయి. కొండపైన ఆహ్లాదకర వాతావరణంలో నృసింహుడి నామస్మరణ చేస్తూ యాదగిరీశుడి మహా ప్రసాదం తీసుకునేందుకు భక్తులు క్యూలో వేచి ఉన్నారిలా..

● భువనగిరి అర్బన్, ఆంధ్రజ్యోతి

ఆహ్లాదం ఆనందం



నల్లగొండ జిల్లా కేంద్రం పానగల్ శివారు కాకతీయుల కాలం నాటి ఛాయా సోమేశ్వరాలయంలో శివుడిని దర్శించుకునే వెళ్లే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు ఆహ్లాదకర అనుభూతి కలుగుతుంది. అక్కడికి వెళితే చెరువులో ఏర్పాటుచేసిన ఫౌంటెన్, తేటగా ఉండే నీటిలో చేపల కదలిలు, నీటిపై అలా ఈదులాడే బాతులు ఇలా మరింత ఉల్లాసాన్ని కలిగిస్తాయి.

● నల్లగొండ కల్చరల్, ఆంధ్రజ్యోతి



సేంద్రీయంతో సాగు చేసిన పొలంలో ఆంజనేయులు

మట్టి మనిషి సాగు

● పర్యావరణ హితుడు ఆంజనేయులు ● దశాబ్దంగా సేంద్రీయ సాగే

ప్రకృతిలో మనకు లభించే స్వచ్ఛమైన గాలి, నేల, నీటిని మనం స్వార్థం కోసం కలుషితం చేస్తున్నాం. పంటల్లో అధిక దిగుబడులు, తెగుళ్ల నెపంతో రసాయన ఎరువులను విపరీతంగా వినియోగిస్తున్నాం. ఫలితంగా పర్యావరణం దెబ్బతింటోంది. ఇటువంటి కాలంలో ఓ రైతు సేంద్రీయ సాగే ఊపిరిగా తన పొలాన్ని ప్రయోగశాలగా మార్చి మంచి ఫలితాలు సాధిస్తున్నాడు.

- మిర్యాలగూడ(వ్యవసాయం), ఆంధ్రజ్యోతి

నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన వలిశెట్టి ఆంజనేయులుకు 15 ఎకరాల మాగాణి ఉంది. సాగర్ కాల్వ నీటి ఆధారంగా 1984లో వ్యవసాయం మొదలు పెట్టాడు. అప్పటి నుంచి అందరిలాగానే రసాయనిక ఎరువులతో పంటల సాగుచేశాడు. పెట్టుబడులు పెరగడంతో పాటు దిగుబడులు తగ్గి నష్టాలు చవిచూశాడు. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. ఆ సమయంలో ఆయన కుమార్తె అన్నపూర్ణేశ్వరీ(ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ) సేంద్రీయ వ్యవసాయంతో నేలను పూర్వపు స్థితికి తీసుకురావచ్చని తండ్రికి సలహా ఇచ్చింది. ఆమె స్ఫూర్తితో 2006లో సేంద్రీయ వ్యవసాయం వైపు ఆంజనేయులు దృష్టి సారించారు.

సేంద్రీయ ఎరువుల తయారీ

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, పాలేకర్ సేంద్రీయ సాగు విధానంపై శిక్షణ తీసుకున్నాడు. 2006 నుంచి ఆయన ఇంటినే ప్రయోగశాలగా మారాడు. ఓ ఆవును కొనుగోలు చేసి పశువుల ఎరువు, సేంద్రీయ ఎరువులైన బవేరియా, మెటారైజం, ఒట్టి శల్యం, ట్రైకోడెర్మా వంటివి తయారు చేస్తున్నాడు. ఇవి వరి, ఇతర పంటలకు వచ్చే అన్నిరకాల తెగుళ్ల నివారణకు ఉపయోపడతాయి. మరో 18 రకాల ఫంగిసైడ్స్ సూడోమోనోస్, అజిటో బ్యాక్టర్, అజోస్పైరిల్లం, పాస్ఫోబ్యాక్టీరియా(భాస్వరం), జింక్‌సోలోబీజంస్ బ్యాక్టీరియా, సిలికాన్, ఎన్.పీ.కే, వర్మివాష్, (24 రకాల సూక్ష్మపోషకాలు) పొటాష్(అరటిబోదెలు,బెల్లంతో), ఫిష్‌అమినో యాసిడ్స్ (చేపలను ఊరబెట్టి) స్పీడ్ బయోఎంజైమ్, వేపనూనె, (కాయలు నానబెట్టి తయారీ), జీవామృతం (ఆవు మూత్రంతో) సిట్రిక్ యాసిడ్(నిమ్మకాయలతో తయారు)ఇంటిలో తయారు చేసుకుని పంటలకు ఉపయోగించే వాడు.



సాగులో..

- పొలాల్లో పశువులు ఎరువు వేయడం. పంట సాగుకు ముందు ప్రతి ఏటా జీలుగ వంటి పచ్చిరొట్ట సాగు చేసి కలియదున్నడం,
- పొలం నాటే ముందు అతను తయారు చేసిన 18 రకాల కల్చర్లను ఎకరానికి లీటర్ చొప్పున పొలంలో పోయడం. అదే పద్ధతిలో 15రోజులకు ఒకసారి పంట పూర్తయ్యే వరకు వాడుతారు.
- నాటు వేసిన రెండు నెలలకి అవసరాన్ని అనుసరించి తయారు చేసిన కల్చర్‌లు పిచికారీ.
- పొట్ట దశలో ఏడు రకాల మొలకలతో తయారు చేసిన (నువ్వులు, పెసర్లు, అలసందలు, మినుములు, పిల్లిపెసర, గోధుమ, శనగలు, 100గ్రాముల మొలకలు, 2 లీటర్ల ఆవుమూత్రం) ద్రావణాన్ని, పొటాష్ (అరటిబోదెతో తయారీ) పిచికారీ చేయడం.

సేంద్రీయంతో రైతులకు ప్రయోజనం



పంటల సాగులో సేంద్రీయం అనేది రైతులు మర్చిపోయారు. సేంద్రీయ సాగుతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. నేలలో 2-3వరకు ఉండాల్సిన కర్బనశాతం సేంద్రీయం వాడకం లేక 0.5శాతానికి పడిపోయింది. అందుకే రసాయనాలు వాడటం లేదు.. సేంద్రీయ ఎరువుల తయారీ పంటలకు వాడటంపై ఏళ్ల తరబడి ప్రయోగాలు చేస్తున్నా. ఇది చాలా కష్టంతో కూడినదే, తయారీలో చాలా ఖర్చు తక్కువ. పంటల సాగులో మంచి ఫలితాలు సాధించొచ్చు. ఈ పద్ధతి రైతులకు చాలా ప్రయోజకరం.

- ఆంజనేయులు, రైతు

తెగుళ్ల ఊసే లేదు

సన్నరకం వరి సాగులో తెగుళ్ల సమస్య అధికంగా ఉంటుంది. పచ్చపురుగు, మొగి, దోమ, బూడిద తెగులు, దోమ, కంకినల్లి వ్యాపించి పంటలను దెబ్బతీస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. ఆంజనేయులు సాగు చేసే వరి పంటకు ఇప్పటి వరకు ఎటువంటి తెగుళ్లు ఆశించలేదంటే అతిశయోక్తి కాదు. చాలా తక్కువ పెట్టుబడితో ఎకరానికి 45-50 బస్తాల దిగుబడి సాధిస్తున్నాడు. సేంద్రీయ ఎరువుల తయారీకి ఎకరానికి కేవలం రూ5వేల వరకు ఖర్చు చేస్తున్నాడు. ఆయన పొలంలో పూర్వకాలం నాటి కూచుబతాణి, పంచరత్న, కులాకర్, రత్నచోడి, చిట్టిముత్యాలు, కాలపట్టి, వ్యపిలేసాంబ వరి రకాలు సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు.

● పర్యావరణంపై ప్రేమతోనే..

ఆంజనేయులు ఇంటర్ వరకు చదివినా ఆయనకు పర్యావరణంపై అమితమైన ప్రేమ. అదే ఆయన్ను ముందుకు నడిపించింది. సేంద్రీయ ఎరువులపై శ్రద్ధతో 18 ఏళ్లుగా ఎన్నో ప్రయోగాలు చేశాడు. తయారీలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా అధైర్య పడలేదు. చుట్టుప్రక్కల రైతులు అవహేళన చేసినా పట్టించుకోలేదు. అనుకున్నది సాధించి మట్టిమనిషిగా రైతు లోకానికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.



పొలం మధ్య పిచ్చుక గూడు

● పంటల సాగుపై పట్టు

ప్రస్తుత కాలంలో రసాయనిక ఎరువులు లేకుండా పంటల సాగు కష్టతరమైంది. ఏళ్ల తరబడి ఆయన ఎంతో కష్టపడ్డాడు. మొదట్లో ప్రతికూల వాతావరణంతో సేంద్రీయ పంటల సాగు ముందుకు సాగలేదు. కొంతమేర రసాయన ఎరువులు వాడాల్సి వచ్చింది. కాలక్రమేణ నేలను బలోపేతం చేస్తూ వరి సాగులో 100 శాతం సేంద్రీయంతో మంచి ఫలితాలు సాధిస్తున్నాడు. ప్రస్తుతం ఆయన పొలం మట్టిలో వానపాములు, వరి పంటలో సాలె పురుగులు. ఎక్కడ చూసినా పిచ్చుకలు గూళ్లు కట్టుకున్నాయి.

నీ సేవకు సలాం





ప్రాణాలకు ఎదురొడ్డి..

ఆత్మకూరు(ఎం) పోలీస్‌స్టేషన్‌పై 2006 ఆగస్టు 18న నక్సలైట్లు జరిపిన దాడిలో నాటి ఎస్‌ఐ ఎండి చాంద్‌పాషా, ఏఎస్‌ఐ సుల్తాన్ మెహినొద్దీన్, హోంగార్డు ఇంజమూరి లింగయ్య, 2015 ఏప్రిల్‌లో మోత్కూరు మండలం జానకీపురం వద్ద జరిగిన ఉగ్రవాదుల దాడిలో ఎస్‌ఐ డి. సిద్ధయ్య, కానిస్టేబుల్ సీహెచ్ నాగరాజు వీరమరణం పొందారు. 2015 ఏప్రిల్‌లో సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో సిమి ఉగ్రవాదులను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఆ సమయంలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో అప్పటి సూర్యాపేట పట్టణ ఇన్స్‌పెక్టర్ వై. మొగిలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా కానిస్టేబుల్ లింగయ్య, హోంగార్డు మహేశ్వర్ వీరమరణం పొందారు. ఇప్పటి వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు 29 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారు.

- విధి నిర్వహణలో ప్రాణాలకు ఎదురొడ్డి నిలిచిన పోలీసులు
- ప్రజల రక్షణే ధ్యేయం.. ప్రాణాలు లెక్కచేయని నైజం
- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

పోలీస్.. ఈ పదమే గంభీరం. తెగువకు త్యాగానికి పర్యాయ పదం. ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసులు మేల్కొని, కాపలా కాస్తుంటారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఎందరో ప్రాణ త్యాగాలు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల యాదిలో వారి కుటుంబసభ్యులు జీవనం సాగిస్తున్నాయి. కుటుంబ బాధ్యతలు చూసే పెద్దను కోల్పోవడంతో కుటుంబసభ్యులకు వెలితిగా మారింది. ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తమ పిల్లలు ఉన్నతస్థితిలో చూడాలని కలలు కన్న పోలీస్ అమరుల లక్ష్యాలు నెరవేర్చేందుకు ముందుకు సాగుతున్నారు. నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పోలీసు అమరవీరుల కుటుంబసభ్యులు తమ వారి జ్ఞాపకాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

● ఆంధ్రజ్యోతి- ఆత్మకూరు(ఎం), సూర్యాపేట క్రైం, శాలిగౌరారం.

నిన్నెలా మరువగలం

పిల్లల్ని నన్ను కంటికి రెప్పలా చూసుకొనేవారు

మా ఆయన చనిపోయి 18 సంవత్సరాలు కావొస్తున్నా ఆయన ఉన్నపుడు మాకు అందించిన ప్రేమ, అనుబంధాలను నేటికీ మేం మర్చిపోలేదు. ఆయనలేని లోటు ఎప్పటికీ మర్చిపోలేం. ఎక్కడ డ్యూటి చేసినా ప్రతి అరగంటకోసారి ఫోన్‌చేసి పిల్లలు ఏం చేస్తున్నారని అడిగేవారు. మాకు నలుగురు సంతానం. పిల్లల్ని, నన్ను అపురూపంగా కంటికి రెప్పలా చూసుకునేవారు.

- జైబానిషా, ఎస్‌ఐ ఎండీ. చాంద్‌పాషా భార్య

నమ్మకానికి చిరునామా కానిస్టేబుల్ మెట్టు లింగయ్య



లింగయ్య (ఫైల్)

నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం బండ మీదిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న మెట్టుగూడెం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ మెట్టు లింగయ్య(గన్‌మెన్) సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ 2015 ఏప్రిల్ 2న అర్ధరాత్రి సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో దుండగుల కాల్పుల్లో వీరమరణం పొందాడు. దుండగుల కాల్పుల్లో గాయపడ్డ సీఐ మొగులయ్యకు నమ్మిన బంటుగా ఉండేవారు. కోదాడ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ మెట్టు లింగయ్య విధులు నిర్వర్తించే సమయంలో సీఐ మొగులయ్య అక్కడే పనిచేస్తున్నాడు. లింగయ్య చురుకుదనం, క్రమశిక్షణను పసిగట్టిన సీఐ మొగులయ్య లింగయ్యను తన గన్‌మెన్‌గా నియమించుకున్నారు. సీఐ మొగులయ్య సూర్యాపేట పట్టణానికి బదిలీ అయినా లింగయ్యనే తన గన్‌మన్‌గా నియమించుకున్నారు. సూర్యాపేట బస్టాండ్‌లో సీఐ మొగులయ్య వెంట గన్‌మెన్‌గా వచ్చిన లింగయ్య దుండగుల కాల్పుల్లో విధి నిర్వహణలో అసువులు బాశాడు.

కానిస్టేబుల్ లింగయ్య కుటుంబ నేపథ్యం..

ఉట్కూరు సమీపంలోని మెట్టుగూడెం గ్రామానికి చెందిన మెట్టు ఉత్తరయ్య - బుచ్చమ్మలకు లింగయ్య మూడో సంతానం. లింగయ్యకు ఇద్దరు అన్నలు, ఒక చెల్లెలు ఉన్నారు. పెద్ద న్న అనారోగ్యంతో ఎనిమిది సంవత్సరాల క్రితం చనిపోయాడు. రెండో అన్న సురేందర్ తిరుమలరాయినిగూడెంలో ఆర్‌ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు స్వగ్రామంలోనే ఉంటున్నారు. లింగయ్యకు కేతేపల్లి మండలం బొప్పారం గ్రామానికి చెందిన భవానితో వివాహం జరిగింది. ప్రస్తుతం భవాని నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేస్తున్నారు. కూతురు భూమిశ్రీ 5వ తరగతి చదువుతోంది.

అమ్మా.. ఆ ఫొటో ఎవరిది



కన్న తండ్రి ఫొటో చూసి 'అమ్మా.. ఆ ఫొటో ఎవరిది' అని కొడుకు అడిగినప్పుడు ఆ బాధ గుండెల్ని పిండేస్తుందని ఎస్‌ఐ డి. సిద్ధయ్య భార్య ధరణీషా ఆవేదన చెందారు. 2015లో ఒకే ఆస్పత్రిలో భర్త మరణం, మరోవైపు ధరణీషా మగబిడ్డకు జన్మనియ్యడం మర్చిపోలేని హృదయ విదారక సంఘటన. సిద్ధయ్య కొడుకు అయాన్‌సిద్ధిక్ ఇప్పుడు నాలుగో తరగతి చదువుతున్నాడు. ధరణీషా గద్వాల్ జిల్లా మానుపాడు మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయాన్‌సిద్ధిక్‌కు తండ్రి గురించి ఏమీ తెలియదు. ఇంట్లో సిద్ధయ్య ఫొటో చూసి ఆ ఫొటో ఎవరిదని అడిగినప్పుడు ఓ తల్లిగా తాను పడే బాధ ఎవరికీ చెప్పుకోలేను అని సిద్ధయ్య భార్య చెమ్మగిల్లే కళ్లతో అన్నారు.

ప్రాణాలను సైతం పణంగా పెట్టి పని చేస్తున్నాం



ప్రజల కోసం, సమాజం కోసం , శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోలీసు లు పని చేస్తున్నాం. ఎంతో మంది పోలీస్ సిబ్బంది దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేశారు. పోలీస్ శాఖకు ప్రజల మద్దతు బాగా ఉంది. పోలీసులు కూడా ప్రజల కోసమే ఉన్నాం, పని చేస్తున్నాం. విధి నిర్వాహణలో ప్రాణాలర్పించిన అమరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలి. పోలీస్ సిబ్బంది విధి నిర్వాహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. సిబ్బంది, అధికారులకు సమస్యలు ఉంటే నేరుగా తెలపాలి. ఒత్తిళ్లకు గురికాకూడదు. సమస్యలకు ఎదురొడ్డి పోరాడాలి. అమరుల త్యాగాలు వృథా కానివ్వం. పోలీస్ అమరవీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.

- సన్‌ప్రీత్‌సింగ్, సూర్యాపేట జిల్లా ఎస్పీ.

ఉన్నతంగా తీర్చిదిద్దాలని భావించారు..



తన పిల్లలందరినీ ఉన్నతంగా తీర్చిదిద్దాలని మా ఆయన భావించారు. ఎనిమిదేళ్ల సర్వీస్ ఉండగా విధి నిర్వాహణలో మృతిచెందడంతో జీవితాలు తారుమారయ్యాయి. నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలను బాగా చదివించాలనుకున్నారు. కానీ ఆకస్మిక మరణం ఆయన లక్ష్యాలను నెరవే ర్చకుండా చేసింది. తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో 2000 సంవత్సరంలో నక్సలైట్లు పోలీస్ స్టేషన్‌పై జరిపిన దాడిలో బడే సాహెబ్ మృతిచెందారు. ప్రభుత్వం అప్పట్లో రూ.9లక్షల ఎక్స్‌గ్రేషియా, పెద్ద కుమారుడికి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం, నల్లగొండలో 300 గజాల ప్రభుత్వ ఇంటి స్థలం, మరో ఇద్దరు కుమారులకు హోంగార్డులుగా ఉద్యోగం ఇచ్చారు. ఇంటి పెద్దదిక్కు లేకపోవడం కుటుంబ భారం ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం కుటుంబ సభ్యులు అందరూ బాగానే ఉన్నా బడెసాహెబ్ అనుకున్న లక్ష్యాన్ని అందుకోలేకపోయారు. ఆయన జీవించి ఉంటే మరో విధంగా ఉండేది.

- మహిబున్నీసాబేగం, హెడ్‌కానిస్టేబుల్ బడెసాహెబ్ భార్య

ఎవరిని చూసినా మా తమ్ముడు గుర్తుకొస్తాడు



'పండుగలప్పుడు ఎవరిని చూసినా మా తమ్ముడు గుర్తుకొస్తాడు' అని ఆత్మకూరు(ఎం) పోలీస్‌స్టేషన్‌పై 2006 ఆగస్టు 18న నక్సలైట్లు జరిపిన దాడిలో అమరుడైన రామన్నపేట మండలానికి చెందిన హోంగార్డు ఇంజమూరి లింగయ్య అక్కలు వసంత, పార్వతమ్మ కన్నీరు పెట్టుకున్నారు. మూడు తరాల తర్వాత మా ఇంట్లో మా తోడ తమ్ముడు పుట్టాడని ఎంతో సంతోష పడ్డాం. కానీ ఆ దేవునికి మాపై దయలేక ఉన్న ఒక్క తమ్ముడిని తీసుకుపోయాడు. మా అమ్మ నాన్నలకు గాని, మాకు గాని మా తమ్ముడు లేని లోటు మేము బతికున్నంత కాలం గుర్తుంటుందని వారు తమ్ముడి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

ఆ వెలితి పూడ్చలేనిది ..



సిమి ఉగ్రవాదుల చేతిలో మృతిచెందిన హోంగార్డు మహేష్ మృతిచెందిన విషయంలో ప్రభుత్వం ఆదుకున్నప్పటికీ ఆయన లేని వెలితిని పూడ్చలేరు. ప్రభుత్వం ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా, 300 గజాల ఇంటి స్థలం అందజేసింది. మాకు ఇద్దరు కుమార్తెలు. మా పెద్ద కుమార్తె విజయదుర్గను ఐపీఎస్ చేయాలని ఎంతో తపించేవాడు. ఆయన ఆశలను నిజం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నా. ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలంలో మునిసిపల్ అధికారులు పార్కు ఏర్పాటు చేశారు. వేరేచోట ఇస్తామన్నారు.

కుమార్తెలు తండ్రిలేని లోటుతో ఇబ్బందులు పడుతున్నారు. మహేష్ లేకపోవడంతో కుటుంబ కూడా ఇబ్బందుల్లో ఉంది.

- మమత, హోంగార్డు మహేష్ భార్య

మహేష్ లేని లోటు తీరనిది : తల్లిదండ్రులు

మహేష్ లేని లోటు తీరనిది ఆయన తల్లిదండ్రులు రాంచంద్రు- కొమరమ్మ అన్నారు. ఒక్కగానొక్క కుమారుడు ఆకాల మృతి ఎంతో బాధించిందన్నారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దుతాడనుకున్న కుమారుడు మృతితో ఏమీ చేయలేకపోతున్నామని అన్నారు. వృద్ధాప్యంలో తమ పోషణను చూసేందుకు కుమారుడు లేకపోవడం బాధగా ఉందన్నారు. కుమారుడిని తలచుకుంటూ బతుకుతున్నామన్నారు.

క్రైం పాయింట్

Crime point


ఆకారంలో పట్టపగలే చోరీ

శాలిగౌరారం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలే ఇంటి వెనుక తలుపులు పగుల గొట్టి సుమారు రూ.6లక్షల సొత్తు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ డి. సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాపర్తి ఏసురత్నం ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు దాదాపు 9.5తులాల బంగారు ఆభరణాలు, 12తులాల వెండి పట్టా గొలుసులు దొంగిలించారు. ఏసురత్నం, ఆయన భార్య వ్యవసాయం పనుల నిమిత్తం వెళ్లే సమయంలో తొందరలో వెనుక నుంచి డోర్ వేసి గడియ పెట్టడం మరిచిపోయారు. దీంతో దొంగలు వెనుక ద్వారం నుంచి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న వెండి, బంగారు ఆభరణాలు దొంగిలించారు. చోరీకి గురైన సొత్తు సుమారు రూ.6లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్యాటరీల దొంగల గుర్తింపు

మర్రిగూడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని పలు గ్రామాల్లో వాహనాలకు సంబంధించిన బ్యాటరీల చోరీలకు పాల్పడిన వారిని సీసీ పుటేజీల ద్వారా గుర్తించినట్లు సమాచారం. ఈ నెల 19వ తేదీన మండలంలోని సరంపేట, రాంరెడ్డిపల్లి, మర్రిగూడ, ఎరుగండ్లపల్లి గ్రామాలలోని రాత్రిపూట బ్యాటరీలను దొంగిలిం చారు. పోలీసులు మర్రిగూడ చౌరస్తాలోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఒక కారులో మాల్‌కు వెళ్తున్నట్లు గుర్తించారు. ఆదివారం ఉదయమే మాల్, రంగారెడ్డి జిల్లా యాచారం మండలకేంద్రంలో వివిధ ప్రైవేట్ వ్యాపారస్తుల సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. ఆ దొంగలు యాచారం నుంచి అదే కారులో వెళ్లినట్లు సమాచారం. రెండు, మూడు రోజుల్లో దొంగలను అదుపులోకి తీసుకోనున్నట్లు సమాచారం

మరమ్మతులు చేస్తుండగా తెగిన చెరువుకట్ట



తెగిన చెరువు కట్ట

గుర్రంపోడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని మక్కపల్లి గ్రామంలో గల హన్మంతుల చెరువు కట్ట మరమ్మతులు చేస్తుండగా తెగింది. ఈ చెరువు కట్ట ఆరు సంవత్సరాల క్రితం తెగింది. అప్పటి నుంచి చెరువులోకి నీరు రాలేదు. ఈ చెరువులోకి పసునూరు, రేపల్లి, శాకాజీపురం చెరువులు నిండి నీరు చేరుతోంది. చెరువు కట్ట మరమ్మతుల కోసం రూ.16లక్షలతో ఇటీవల పనులు మొదలయ్యాయి. కట్ట మరమ్మతులు చేసేందుకు రింగ్‌లు ఏర్పాటు చేసి చెరువులో నీరు ఉండడంతో మరమ్మతులు పూర్తిస్థాయిలో కొనసాగలేదు. చెరువులోకి నీరు భారీగా ప్రవహించడంతో మరమ్మతులు చేసిన చోట కట్ట కొట్టుకుపోయింది. ఈ చెరువు కట్ట తెగిపోవడంతో వంపుగుండా గుడిపల్లి చెరువులోకి నీరు చేరుతోంది.

బస్సును ఢీకొట్టి డీసీఎం బోల్తా

● డీసీఎం వాహనంలో తరలిస్తున్న 9 గోవులు మృతి ● సామూహిక ఖననం చేసిన పోలీసులు ● సజీవంగా ఉన్న జీవాలు గోశాలకు తరలింపు



నుజ్జయిన ధ్వంసమైన డీసీఎం, గోవుల కళేబరాన్ని తరలిస్తున్న యువకుడు

నార్కట్‌పల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మూగ జీవాలను తరలిస్తున్న డీసీఎం బోల్తా పడటంతో తొమ్మిది గోవులు మృతిచెందగా, ఇద్దరు కూలీలకు గాయాలయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల శివారులో ఈ ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన సుమారు 40 గోవులను (9 ఆవులు, 31 కోడెలు) టీజీ 07 యూ 2606 నెంబర్ గల డీసీఎంలో హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 3.45 గంటల సమయంలో నార్కట్‌పల్లి మండల కేంద్రానికి సమీపంలోని పూజిత హోటల్ వద్దకు చేరుకుంది. ఆ ప్రదేశంలో రోడ్డు పక్కన నిలిపిఉంచిన మియాపూర్-1 డిపో బస్సును వేగంగా వెనుకనుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో డీసీఎం రోడ్డుపై బోల్తా కొట్టడంతో అందులో తరలిస్తున్న 40 జీవాలు ఒకదానిపై ఒకటి పడి ఊపిరాడక 2 ఆవులు, 7 ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. కొన్ని గోవులు బెదిరి పరుగు లంఘించాయి. ప్రమాద సమాచారం అందుకున్న బీజేపీతో పాటు హైందవ సంఘాలకు చెందిన నాయకులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి డీసీఎంలో ఇరుక్కున్న గోవులను స్థానిక యువకుల సహకారంతో వెలికితీశారు. తొమ్మిది జీవాల కళేబరాలకు పశువైద్యాధికారి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం నార్కట్‌పల్లిలోనే సామూహిక ఖననం చేశారు. గాయపడిన వాటికి వెటర్నరీ వైద్యునితో చికిత్స చేయించి మాడ్గులపల్లి మండలం చెర్వుపల్లిలోని జై జనార్ధన గోసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు తరలించారు. ప్రమాదం అనంతరం డీసీఎం డ్రైవర్ గోపాల్ పరారీ కాగా అందులో సహాయకులుగా ఉన్న ఇద్దరు కూలీలు గాయపడ్డారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. నార్కట్‌పల్లి సీఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. గోవులను గోశాలకు తరలించడంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొర్వి శంకర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, చిన్ననారాయణపురం గ్రామానికి చెందిన యువకులు పోలీసులకు సహకరించారు.

పెళ్లింట సంతోషం ముగియకముందే..

● కుమార్తె పెళ్లి చేసిన మూడు రోజులకే భార్యాభర్తల మధ్య గొడవ ● పురుగుల మందు తాగి దంపతుల ఆత్మహత్యాయత్నం ● భర్త మృతి, భార్య పరిస్థితి విషమం



వెంకటయ్య(ఫైల్), చికిత్స పొందుతున్న జ్యోతి

గుర్రంపోడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆ ఇంట్లో పెళ్లి జరిగిన సంతోషం మూడు రోజులు కాకముందే విషాదం నెలకొంది. కుమార్తెకు పెళ్లి చేసిన ఆ దంపతులు ఆర్థిక ఇబ్బందుల విషయంలో గొడవ పడ్డారు. మాటామాట పెరగడంతో ఇద్దరూ పురుగుల మందు తాగారు. ఈ ఘటనలో భర్త మృతిచెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఆదివారం నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని మొసంగి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మొసంగి గ్రామానికి చెందిన బడుగుల వెంకటయ్య(40), జ్యోతి(35) దంపతులకు ఇద్దరు కుమార్తెలు(కవలలు), కుమారుడు ఉన్నాడు. చిలకాపురం గ్రామానికి చెందిన వెంకటయ్య బావమరిది అయిన కొండల్‌తో ఈ నెల 17వ తేదీన పెద్ద కుమార్తె రమణ వివాహం జరిపించారు. వెంకటయ్య తన కున్న మూడెకరాల భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేస్తుంటాడు. ఇటీవల పెళ్లి కోసం కొంత అప్పు తెచ్చినట్టు సమాచారం. ఆర్థిక ఇబ్బందుల విషయమై ఆదివారం సాయంత్రం భార్యాభర్తలు గొడవపడి పురుగుల మందు తాగారు. కుటుంబసభ్యులు, స్థానికులు గమనించి నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా వెంకటయ్య మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య జ్యోతి నల్లగొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి కూడా విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వెంకటయ్య మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తండ్రి మృతదేహం మార్చురీలో, తల్లి చికిత్స పొందుతూ ఐసీయూలో ఉండటంతో కుటుంబ సభ్యులతో ఆస్పత్రి ఆవరణలో కన్నీరుమున్నీరవుతున్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	589.60
టీఎంసీలు	310.8498
ఎడమకాల్వకు నీటి విడుదల	6,173
కుడికాల్వకు	5,496
విద్యుత్ కేంద్రం ద్వారా	29,070
సాగర్‌కు నీటి రాక	1,79,971
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	2,28,175 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	2,02,404 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	20

- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.54 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	2,39,417
అవుట్‌ఫ్లో	1,90,744 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	7

- మేళ్లచెర్వు,(ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.60 అడుగులు
టీఎంసీలు	4.10
ఎన్ని గేట్ల ద్వారా	3,7,8,10
ఇన్‌ఫ్లో	1429.27 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	28,73.23 క్యూసెక్కులు

- కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	20 అడుగులు

- శాలిగౌరారం,(ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3770 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3770 క్యూసెక్కులు

-డిండి,(ఆంధ్రజ్యోతి)

ఒంటరిగా ఉంటూ.. అనారోగ్యంతో మృతిచెంది..

● మూడు రోజుల క్రితం ఘటన.. కుళ్లిన మృతదేహం ● మిర్యాలగూడలో ఘటన

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉంటున్న వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా, మూడు రోజులుగా మృతదేహం ఇంట్లోనే ఉండి కుళ్లిపోయింది. దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. టూటౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలంలోని నందిపహాడ్‌కు గ్రామానికి చెందిన ఈశ్వనాథుల నాగయ్యచారి (47) కార్పెంటర్‌గా పని చేస్తూ జీవనం గడిపేవాడు. 20ఏళ్ల క్రితం వివాహంకాగా, మిర్యాలగూడలో పనులు చేసుకుంటూ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తల వివాదాల కారణంగా పదేళ్ల క్రితమే విడిపోయారు. నాగయ్యచారి ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. నాగయ్యచారి బయటకు రాకపోవడం, ఇంట్లో నుంచి దుర్వాసన రావడాన్ని గమనించిన ఇరుగు పొరుగువారంతా వెళ్లిచూశారు. దీంతో కుళ్లిపోయిన దశలో ఉన్న నాగయ్యచారి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితమే మృతి చెందినట్లుగా భావిస్తున్నట్లు సీఐ తెలిపారు. అనంతరం నందిపాడు గ్రామంలో ఉంటున్న తల్లికి సమాచారం అందజేసి మృతదేహాన్ని అప్పగించారు. మృతుడు నాగయ్యచారి తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు సీఐ నాగార్జున తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం


త్రిపురారం అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామం శివారులో నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో శనివారం రాత్రి గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 40 సంవత్సరాల వయస్సుగల గుర్తుతెలియని మహిళ మృతదేహం సాగర్ ఎడమ కాల్వ నుంచి బయటకు తీశారు. కాళ్లకు కడియాలు, బ్లూ కలర్ జాకెట్ ఉన్నాయి. కంపసాగర్ బిల్ కలెక్టర్ అల్లాడి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగుపాటుతో తెగిపడిన విద్యుత్ తీగలు

● చూసుకోకుండా కాలు పెట్టడంతో విద్యుదాఘాతంతో మహిళ మృతి ● యాదాద్రిభువనగిరి జిల్లాలో ఘటన

రామన్నపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో శనివారం రాత్రి కురిసిన ఈదురు గాలులు, వర్షానికి పిడుగుపడి విద్యుత్ తీగలు తెగి కిందపడ్డాయి. ఆదివారం ఉదయం ఆ విద్యుత్ తీగలను చూసుకోకుండా కాలు పెట్టిన గ్రామానికి చెందిన మహిళ విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఎస్‌ఐ ఎం. మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పి. పద్మ(56) రోజు మాదిరిగా ఆదివారం ఉదయం తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్తుండగా అదే దారిలో ఉన్న సింగారపు అశోక్ వ్యవసాయ బావి వద్ద శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అదే సమయంలో విద్యుత్ లైన్‌పై పిడుగు పడడంతో విద్యుత్ తీగలు తెగి కిందపడ్డాయి. తెల్లవారుజామున కావడంతో ఎవరూ చూడకపోవడంతో అటు వెళ్లిన పద్మ చూసుకోకుండా వాటిపై కాలు పెట్టడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. కొద్ది సేపటి తర్వాత అటుగా వచ్చిన గ్రామస్థులు గమనించి రామన్నపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పద్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పద్మ కుమారుడు ఆవుల లింగస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పొలంలో ఉన్న విద్యుత్ వైరు చూసుకోకుండా..



చివ్వెంల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పొలంలో పడి ఉన్న విద్యుత్ వైరు చూసుకోకుండా కాలు పెట్టడంతో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని ఖాసీంపేట గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన పందుల జానకిరాములు(50), మద్దిశ్రీనివాస్ పొలానికి శ్రీనివాస్, లింగయ్యలతో కలిసి పొలంలో పురుగుల మందు కొట్టడానికి వెళ్లాడు. జానకిరాములు పొలంలో పురుగుల మందు కొడుతుండగా అప్పటికే కరెంట్ వైరు తెగి పొలంలో పడి ఉంది. చూడకుండ దానిని తొక్కడంతో జానకిరాములు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కాపాడబోయిన మద్దిశ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. కరెంట్ వైరు తెగి పడడంలో నిర్లక్ష్యం వహించిన లైన్‌మన్, ఏఈలపై చర్య తీసుకోవాలని జానకిరాములు కుమారుడు శివ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ. కనకరత్నం తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నమెంట్ నిర్వహించేందుకు కృషి

గుర్రంపోడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామంలో రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నమెంట్ నిర్వహించేందుకు కృషి చేస్తామని మాజీ ఎంపీపీ చెనమల్ల మాధవిజగదీశ్వర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గాలి రవికుమార్ అన్నారు. కొప్పోలు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఖోఖో సంఘం రాష్ట్ర కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, ఎంఈవో నోముల యాదగిరి, కాటెపల్లి రాధాకృష్ణ పంతులు, శ్రీనివాస్ యాదవ్, ఆవుల వెంకన్న యాదవ్, అయితగోని శంకర్‌గౌడ్, బల్గూరి నగేష్‌గౌడ్ ఉన్నారు.

5వ పేజీ తరువాయి..

పోషకాహార లోపం పీడిస్తోంది



విద్యార్థినికి కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్యురాలు

వైద్యుడితో పాటు ఒక మహిళా ఆరోగ్య కార్యకర్త, ఫార్మసిస్ట్ ఉంటారు. వీరు ప్రతి రోజు వారికి కేటాయించిన ప్రాంతంలో 120 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. మొత్తం 38 రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలను వీరు నిర్వహిస్తారు. అందులో స్థానికంగా చికిత్స అందించే వ్యాధులకు చికిత్సలు చేసి వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే తక్షణ వైద్య సేవల కోసం పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి విద్యార్థులను పంపిస్తారు.

రక్షణ చర్యలు తీసుకోవాలి

రక్తహీనతతో బాధపడుతున్న వారు దాన్ని అధిగమించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. అందు కోసం ప్రభుత్వం అన్ని పీహెచ్‌సీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలను విద్యార్థులకు ఉచితంగా అందజేస్తోంది. ఇవేగాక మంచి పోషకాహారాన్ని విద్యార్థులు తీసుకోవాల్సి ఉంది. ఐరన్ ఎక్కువగా ఉండే కర్జూరాలు, యాపిల్స్, బీట్‌రూట్, మాంసం, పప్పు ధాన్యాలను ఎక్కువగా తీసుకుంటే రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరిగే అవకాశం ఉంటుంది.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం

ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్నాం. అంతేగాక విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ పరీక్షల ద్వారా కొంతమంది విద్యార్థులు వివిధ వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించాం. వారందరికీ దశల వారీగా మెరుగైన వైద్య చికిత్సలు చేయనున్నాం. ఇప్పటికే కొంతమంది విద్యార్థులకు వైద్య చికిత్సలు పూర్తి చేశాం. విద్యార్థులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే వ్యాధులను దూరం చేసుకోవచ్చు.

● డాక్టర్ కోటి రత్నం, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్

5వ పేజీ తరువాయి..

ఏపీలో బ్రాండెడ్ మద్యం

మనకు తగ్గిన ఆదాయం



వరకు ఏపీ మద్యం ప్రియులకు బ్రాండెడ్ మద్యాన్ని విక్రయించేవారు. ఆ లెక్కన రోజుకు రూ.24లక్షలు, నెలకు రూ.7.20కోట్ల విక్రయాలు ఏపీ మద్యం ప్రియుల కారణంగా ఇక్కడి దుకాణాల్లో జరిగేవి. ప్రస్తుతం ఆ మొత్తం విక్రయాలు తగ్గాయి. సరిహద్దులో ఉన్న దుకాణాల్లో విక్రయాలు తగ్గడంతో ప్రభుత్వానికి సైతం సుమారు రూ.1,000కోట్ల మేర ఆదాయం తగ్గినట్టే.

ఏపీలో అదనపు ధర..

ప్రస్తుతం తెలంగాణ కంటే ఏపీ రాష్ట్రంలో మద్యం ధరలు అధికంగా ఉన్నాయి. మన రాష్ట్రంలో రాయల్ చాలెంజ్ క్వార్టర్ రూ.210, ఫుల్ బాటిల్ రూ.840 ఉంటే, ఏపీ రాష్ట్రంలో క్వార్టర్ రూ.230, ఫుల్ బాటిల్ రూ.920గా ఉంది. క్వార్టర్‌పై రూ.20, ఫుల్ బాటిల్‌పై రూ.80 అదనపు ధర ఉంది. ధరలో స్వల్ప మార్పే ఉండటంతో, ఏపీకి చెందిన మద్యం ప్రియులు తెలంగాణకు వచ్చేందుకు గతంలా అంతగా.. ఇష్టపడటం లేదు. దీంతో ఇక్కడ విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. కోదాడలో ఓ వైన్స్ దుకాణదారుడు ఏపీలో నూతన మద్యం పాలసీ అమలులోకి రాకముందు రోజుకు రూ.7లక్షల విలువైన మద్యం విక్రయించేవారు. పాలసీ వచ్చాక రూ.5లక్షల విలువైన మద్యం విక్రయిస్తున్నారు. అంటే రోజుకు రూ.2లక్షల మేర విక్రయాలు తగ్గాయి. ఇదిలా ఉంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో త్వరలో మద్యం ధరలు పెంచేందుకు ప్రభుత్వాలు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే తెలంగాణ ఎక్సైజ్‌శాఖ మద్యం ధరల పెంపు ప్రతిపాదనను సీఎం రేవంత్‌రెడ్డి ముందుంచినట్టు సమాచారం. క్వార్టర్‌పై రూ.20, బీరుపై రూ.10 ధర పెంచే యోచనలో ఉన్నట్లు తెలిసింది. అదే జరిగితే మద్యం ప్రియులపై మరింత భారం పడనుందని వ్యాపారులు చెబుతున్నారు. అదే విధంగా ఏపీ రాష్ట్రంలో సైతం ఈనెల 26వ తేదీ తర్వాత మద్యం ధరల్లో మార్పు వచ్చే అవకాశం ఉందని సమాచారం. అయితే ఎంత మేర ధరలు పెరుగుతాయో త్వరలో తేలనుంది.

రైతులకు న్యాయం చేయాలి



మోతె మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబరు 20: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. రైతుల సమస్యలపై ఆదివారం మునగాల మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ధర్నా చేసి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిక ముందు రైతులకు ఇచ్చిన హామీలో రుణ మాఫీ, రైతు భరోసా అర్హులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు దశ వారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు సుంకర అజయ్‌కుమార్, కందిబండ సత్యం, తొగరు రమేష్, ఎలక వెంకట్‌రెడ్డి, ఉడుం కృష్ణ, రామిరెడ్డి, శ్రీను, దార వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

● ఈ వానాకాలం పంటకు రైతుబంధు ఇవ్వబోమని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కుంటిసాకులు చెప్పడం దారుణమని రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జీడి భిక్షం తాహెర్ పాషా, మడిపల్లి విక్రమ్, గండూరి కృపాకర్, బొమ్మగాని శ్రీనివాస్‌గౌడ్, అనంతుల దుర్గాప్రసాద్, ఈదుల యాదగిరి, సల్మామస్తాన్, కరుణశ్రీ నాయకులు పాల్గొన్నారు.

● గరిడేపల్లి, పెన్‌పహాడ్‌లో సీఎం దిష్టి బొమ్మలను దహనం చేసేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు.

● జిల్లాలోని అన్ని మండలాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా చేశారు. నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు.

ధర్మభిక్షం జీవితం ఆదర్శనీయం

సూర్యాపేట టౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం జీవితం ఆదర్శనీయమని తెలంగాణ రాష్ట్ర గీత పనివారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన గీత పనివారుల సంఘం వార్షికోత్సవంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లుతో కలిసి పాల్గొని మాట్లాడారు. . మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు రూ. 10లక్షల అందజేయాలని, గీత కార్మికులకు రూ. 5వేలు పింఛన్ అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, దూళిపాళ దనుంజయనాయుడు, తొట్ల ప్రభాకర్, తొగటి మురళి, అనంతుల జానయ్య, బొడ్డు రాంచంద్రయ్య, వెంకరెడ్డి, జానయ్య, సత్యనారాయణ, బూర సైదులు, శ్రీకాంత్, విష్ణు, లింగయ్య, స్వరూప, బూర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● నేరేడుచర్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత వృత్తిలో పనిచేస్తూ తాటి చెట్టు నుంచి కిందపడి మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. ఆదివారం నేరేడుచర్లలో గీత పనివారల సంఘం 67వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఈత వవనాలను పెంచుకునేందుకు ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో ముత్యాల భాస్కర్, బెల్లంకొండ గోవిందు, వడ్డెగాని లింగయ్య, ఐల శ్రీను, చిలకరాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

●చిలుకూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గీతపనివారల సంఘం వ్యవస్థాపకుడు బొమ్మగాని ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌడసంఘం పెద్దలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా కోటయ్య, దొంతగాని రాములు, బూర అంజనేయులు, కటికోల నాగేశ్వరరావు, మండవ అచ్చయ్య, బెల్లంకొండ నాగయ్య, మరీదు సైదులు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పాలకూరి బాబు, బెల్లంకొండ చిరంజీవి కోరారు. గీత పనివారల సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కృష్ణ, రామ్మూర్తి, మల్లయ్య, సైదులు, సత్యనారాయణ, నర్సింహరావు, శ్రీను పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

మఠంపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాల గేమ్ అసోసియేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14పోటీల్లో మఠంపల్లి మండలంలోని మాన్‌ఫోర్డు పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు బి.యశ్వంతి, బి.హర్షిత, ఐ.హర్షితలు ప్రతిభ కనపరిచి ఉమ్మడి నల్గొండలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ సతీష్ తెలిపారు. ఈనెల 27న నల్గొండలోని మేకల అభియాన్ స్టేడియంలో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో సూర్యాపేట జిల్లా తరుపున ఈ విద్యార్థినులు పాల్గొంటారని ఆయన తెలిపారు. . ఎంపికైన విద్యార్థినులను పాఠశాల హెచ్‌ఎం వినోద్‌రెడ్డి, పీఈటీలు వెంకటేశ్వర్లు, సతీష్‌లు అభినందించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చిలుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

చిలుకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు.ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర రూ. 500లతో కలిపి క్వింటా ధాన్యాన్ని రూ.2820లకు కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో గిరిబాబు, ఏవో శ్రీధర్, ఏపీఎం నర్సయ్య, సీతయ్య, శ్వేత పాల్గొన్నారు.

● అనంతగిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే పద్మావతి ప్రారంభించారు. . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సరోజ పుల్లారెడ్డి, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, సింగిల్ విండో చైర్మన్ డేగ బాబు, ముస్కు మాధవరెడ్డి, ఆర్డీవో సూర్యనారాయణ, ఏవో సతీష్, కొండయ్యపాల్గొన్నారు.

● కోదాడ మండలంలోని చిమిర్యాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో నల్లబండగూడెం గ్రామశివారులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా తమ్మర గ్రామశివారులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.

ఎంపీ ఫోటో లేకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం

●కోదాడ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మర గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి ఎమ్మెల్యే పద్మావతి వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి ఫొటో లేకపోవడంతో అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు

●మునగాల రూరల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి ఆదివారం మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో మునగాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పద్మావతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, వైస్ చైర్మన్ చెన్నారెడ్డి, స్టాలిన్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు మల్లయ్య, గంగిరెడ్డి, పాల్గొన్నారు.

●తిరుమలగిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఆదివారం తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మట్లాడారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, వై.నరేష్, పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, జుమ్మీలాల్, సుంకరి జనార్దన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● అర్వపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఆదివారం జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో లక్ష్మీనరసింహ స్వామి, ఉమామహేశ్వర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలనుప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, నిరంజన్, వెంకన్న, నరేష్, వీరసోములు, పాల్గొన్నారు.

● తుంగతుర్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సామేలు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, గుజ్జ యాకయ్య, దొంగరి గోవర్ధన్, అధ్యక్షులు ఉప్పుల రాంబాబు, వెంకన్న, పెద్దబోయిన అజయ్ పాల్గొన్నారు.

● నాగారం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫణిగిరి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సామేలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, నాయకులు సుంకరి జనార్దన్, తోడుసు లింగయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుంటకండ్ల ఆశోక్‌రెడ్డి సోమయ్య, నర్సింహారెడ్డి, నాతి వీరమల్లు, గట్టు లక్ష్మీకాంత్, పాల్గొన్నారు.

అన్నదాన వితరణ కమిటీ ఎంపిక

నూతన్‌కల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నూతన్‌కల్ ఉమ్మడి మండలంలో అన్ని రకాల మాలధారులకు శ్రీ ధర్మ శాస్త్ర అన్నదాన సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా అన్నదానం చేయడానికి ఆదివారం నూతన కమిటిని ఎంపిక చేసినట్లు శ్రీశంభులింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ చురికంటి చంద్రారెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా కాముని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా చూడి మధుసూదన్‌రెడ్డి, సభ్యులుగా తీగల శ్రీనివాసరెడ్డి, పగిళ్ల వెంకట్‌రెడ్డి, సైరెడ్డి వీరారెడ్డి, బిక్కి సంపత్, మేడిపల్లి లింగస్వామి, ఆకుల మల్లేష్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడు అంజయ్య మృతి

పెన్‌పహాడ్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని భక్తళాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని యర్రంశెట్టిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యర్రంశెట్టి అంజయ్య(49) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. రెండు రోజుల క్రితం అంజయ్యకు తీవ్ర జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అంజయ్య అంత్యక్రియలను సోమవారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం



సూర్యాపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, అక్టోబరు 20 ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం లభిస్తుందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా షటిల్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. నేటి యాంత్రిక యుగంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతిరోజు అరగంట పాటు వ్యాయామం, నడవ అలవాటు చేసుకోవాలన్నారు పబ్లిక్ క్లబ్‌ను ఆదర్శవంతమైన ఫ్యామిలీ క్లబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, పబ్లిక్ క్లబ్ సెక్రెటరీ, కొప్పుల వేణారెడ్డి, అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్, చెంచల శ్రీనివాస్, నూకల సుదర్శన్‌రెడ్డి, పోలెబోయిన నర్సయ్యయాదవ్, గవ్వ కృష్ణారెడ్డి, బాలుగౌడ్, ఆలేటి మాణిక్యం, నాగులవాసు, సునీల్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని దురాజ్‌పల్లి ప్రాంతంలో ప్రజల దాహర్తిని తీర్చుం దుకు ఉచితంగా వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దురాజ్‌పల్లిలో సువెన్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడారు.

●సూర్యాపేట రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఏర్పాటుచేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కాసరబాద గ్రామంలో తన సతీమణి రాంరెడ్డి వరూధినిదేవి జ్ఞాపకార్థం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ దోసపాటి గోపాల్, పార్టీ మండల అధ్యక్షుడు కోతిగోపాల్‌రెడ్డి, నాయకులు అబ్దుల్‌రహీం, లయన్స్ క్లబ్ చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, ఉప్పల రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, పోలగాని సైదులు, వెంకట్‌రెడ్డి, కొల్లు నరేష్, కోట ప్రవీణ్ పాల్గొన్నారు.

● మద్దిరాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మద్దిరాల మండల గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు తోట లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, నాయకులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, నర్సయ్య పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాట పటిమను కొనసాగిస్తాం



జాజిరెడ్డిగూడెంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సామేలు

అర్వపల్లి, అక్టోబరు 20: తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ పోరాట పటిమను కొనసాగిస్తామని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఆదివారం జాజిరెడ్డిగూడెం గ్రామంలో 365జాతీయ రహదారి పక్కన శ్రీలక్ష్మీనర్సింహస్వామి రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినరాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాద్‌లోని మహిళ కళాశాలకు చాకలి ఐలమ్మ పేరును సీఎం రేవంత్‌రెడ్డి పెట్టారన్నారు. యువతీ, యువకులు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తుంగతుర్తిపోరాటాల గడ్డ అన్ని అన్నారు. 40ఏళ్ల క్రితం భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి పార్లమెంట్‌లో గోదావరి జలాల కోసం పోరాడారన్నారు. శ్రీరాంసాగర్ రెండో దశ మెయిన్ కాల్వకు బీఎన్‌రెడ్డి పేరు పెట్టిందచే బాధ్యత తనదని అన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు కోలాటాలు, 500 బైక్‌లతో అర్వపల్లి సెంటరు నుంచి భారీ ర్యాలీగా ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందాచార్యులు, బీరవోలు సోమిరెడ్డి, సామ అభిషేక్‌రెడ్డి, గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, ఇందుర్తి వెంకట్‌రెడ్డి, మోరపాక సత్యం, కుంట్ల సురేందర్‌రెడ్డి, గుడిపెల్లి సోమిరెడ్డి, వేల్పుల రమేష్, అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, పాలెల్లి సురేష్, కొడపర్తి అవిలయ్య, దల్వాయి రేణుకశ్రీధర్, జీడి వీరస్వామి, గిరిబాబు, భైరబోయిన మహరాజు, భైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, వెంకటస్వామి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి కొనుగోళ్లు ప్రారంభం

తిరుమలగిరి, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. మార్కెట్‌లో కొనుగోలుదారులు, హమాలీల మధ్య బస్తాల వివాదం రావడంతో మార్కెట్ నాలుగు రోజులుగా మూతపడింది. జిల్లా ఉన్నతాధికారులతో కలిసి కొనుగోలుదారులు, హమాలీలతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. మార్కెట్‌లో 80శాతం గన్నీ బస్తాలు, 20శాతం ప్లాస్టిక్ బస్తాల ద్వారా తూకం వేయడానికి అంగీకరించినట్లు తెలిపారు.

మాజీ కౌన్సిలర్ గురవమ్మ మృతి

హుజూర్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ మునిసిపాలిటీ 16వ వార్డు మాజీ కౌన్సిలర్ కుక్కడపు గురవమ్మ (82) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భర్త కుక్కడపు కాశయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు:ఏ. ఆమెకు భర్త, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కార్యదర్శికి సన్మానం

మఠంపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి ఫలితాల్లో మఠంపల్లి మండలం కాల్వపల్లి తండాలో గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న అంజినికుమార్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అంజినికుమార్‌ను మాజీ సర్పంచ్ మాలోతు సుజాతసక్రునాయక్ ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గం, స్థానిక నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

కోడి పందేలు ఆడుతున్న

నలుగురి అరెస్టు

నేరేడుచర్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కోడి పందేలు ఆడుతున్న నలుగురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫత్తేపురం శివారులో కోడి పందేల శిబిరంపై దాడి చేసి మూడు కోడి పుంజులను నలుగురిని పట్టుకుని,. నిందితుల నుంచి రూ.13 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నిందితుడు పరారైనట్లు ఎస్ఐ తెలిపారు.

దివ్యాంగులకు పింఛన్ అందజేత

హుజూర్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూడో వార్డుకు చెందిన దివ్యాంగులు కణితి నాగాచారి, లక్ష్మణాచారిలకు ముత్తూట్ గోల్డ్ ఫౌండేషన్ (ఎంజీఎఫ్) ద్వారా ప్రతినెలా రూ.1500 చొప్పున పింఛను అందజేస్తున్నట్లు మునిసిపల్ వైస్‌చైర్మన్ సంపత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పింఛన్ పత్రాలను ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంజీఎఫ్ మేనేజర్ నరేష్ , గంజి శివ, వెంకటరెడ్డి, రాధిక, పాల్గొన్నారు.

'హామీలను అమలు చేయాలి'

కోదాడ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గుడిబండ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సీఐటీయూ అనుబంధ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సమావేశంలో సోమపంగు రాధాకృష్ణ, నర్సింగోజు గీత, బాబు, నాగేశ్వరరావు, జాఫర్, సైదా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల మ్మేళనం

గరిడేపల్లి, అక్టోబరు 20:మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993-94 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో చత్రునాయక్, పూర్వ విద్యార్థులు వెంకన్న, రాములు, పాల్గొన్నారు.

ఎస్ఐగా రుద్రక్రాంతికుమార్

తుంగతుర్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : తుంగతుర్తి ఎస్ఐగా రుద్రక్రాంతికుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నల్లగొండలోని మహిళా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏడుకొండలు సూర్యాపేట వీఆర్‌కు బదిలీ అయ్యారు.